ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - తగరపువలస: ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి షేక్ రహిమాన్, సిహెచ్ కాసుబాబులు డిమాండ్ చేశారు. పోలమాంబ ఆటో స్టాండ్ ఎగువ పేట భీమిలి బీచ్ రోడ్ జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో, మోటార్ రంగాన్ని నిర్వీర్యం చేసే విధంగా అన్లైన్ కేసులు తీసుకొచ్చి ఇబ్బందులు పెడుతోందన్నారు. ఇది చాలదు అన్నట్లు జీవో నెంబర్ 21 తీసుకొచ్చిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకి సంవత్సరానికి పన్నుల రూపంలో వేలాది రూపాయలు చెల్లిస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 21ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా నాయకులు కె.కె.సింహాద్రి, డి.నూకరాజు, సీరం గురుమూర్తి, సీరం ధనరాజు, జి.గంగాధర తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం ఆక్రమణ

స్వాధీనం చేసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర - పాయకరావుపేట: ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టణంలోని దుర్గానగర్ కాలనీలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నుండి రామాలయం వరకు రోడ్డు ఆక్రమణకు గురైందని తహశీల్దార్‌కు ఎంపీటీసీ మల్లపురెడ్డి రమాకుమారి ఫిర్యాదు చేశారు. సర్వే చేసిన రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించారు. రోడ్డు ఆక్రమణలు తొలగించి డ్రైను నిర్మించాల్సిన పంచాయతీ అధికారులు హడావుడిగా డ్రైను నిర్మించారు. సర్వే ప్రకారం 60 అడుగులపైనే రోడ్డు ఉండగా కొంత స్థలాన్ని వదిలేసి డ్రైను నిర్మించారు. రోడ్డుకు చివర్లో నిర్మించాల్సిన డ్రైను రోడ్డు మధ్యలో నిర్మించినట్లైంది. దీంతో డ్రైనును హద్దుగా తీసుకొని పక్కనే ఉన్న స్థలం యజమానులు వారి ముందు ఉన్న స్థలాన్ని ఆక్రమించుకొని స్తంభాలు పాతి ఫెన్సింగ్ వేశారు. ఈవిషయమై ఎంపిటిసి రమాకుమారి జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయగా తహశీల్దార్ సర్వే చేసిన రిపోర్టు ప్రకారం ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాలు జారీ చేసి వారం రోజులు దాటుతున్నా నేటికి పంచాయతీ స్థలాన్ని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకోలేదు. ఫెన్సింగ్ వేసి ఆక్రమణకు గురైన స్థలం సుమారు రూ.10 లక్షలు ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఆక్రమణలో ఉన్న పంచాయతీ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని ఎంపీటీసీ మల్లపురెడ్డి రమాకుమారి డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయమై పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా రెవెన్యూ అధికారులు సర్వే చేశారని, హద్దులు అప్పగించలేదని తెలిపారు. ఇదిలావుంటే ఎంపీటీసీ రమాకుమారి స్పందనలో ఇచ్చిన ఫిర్యాదుపై సమస్య పరిష్కారం కాకుండానే సమస్య పరిష్కరించబడినట్లుగా ఫోన్‌కు మెసేజ్ వచ్చింది.

రోడ్డు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ 92వ వార్డు బంటా కాలనీలో కమ్యూనిటీ హాల్ దగ్గర రోడ్డు, డ్రైనేజీ పనులకు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజు, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ బెహరా భాస్కరరావు సుమారు 7 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షులు జి.అప్పలస్వామి నాయుడు, నగర అధికార ప్రతినిధి యతిరాజుల నాగేశ్వరరావు, కంచిపాటి జగదీష్ కుమార్, జావాన శంకర్రావు, షేక్ వల్లి, రాజులమ్మ, మడ్డి సింహాచలం, అప్పలరాజు, చినబాబు, ఊటపల్లి గోవింద్, సూరిబాబు, మనోహర్, ఎ.ఇ. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వీధి కుక్కల నివారణకు చర్యలు చేపట్టండి

జీవీఎంసీ సిబ్బందిని ఆదేశించిన ముమ్మన

విశాలాంధ్ర - పెందుర్తి: వీధి కుక్కల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జీవీఎంసీ సిబ్బందిని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆదేశించారు. పొర్లుపాలెం గ్రామంలో వీధికుక్కల వీరంగం సృష్టించి ఇద్దరిపై దాడి చేసి గాయపరి చాయి. వీరిలో ఓ బాలుడికి తీవ్ర గాయాలు కావడంతో అత్యవసరంగా గోపాలపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్ళి ట్రీట్మెంట్ చేయించారు. ఈ విషయం తెలియడంతో తక్షణమే స్పందించిన జీవీఎంసీ 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు ఆసుపత్రికి వెళ్లి బాలుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. జీవీఎంసీ అధికారులను పిలిపించి వార్డులో సంచరిస్తున్న వీధి కుక్కలు, పందులను నివారించే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మరోసారి ప్రజలపై కుక్కలు దాడి వంటి ఘటనలు జరగకూడదని నిర్దేశించారు. కార్పొరేటర్ వెంట వైసీపీ నాయకులు రాపర్తి మాధవరావు, జీవీఎంసీ అధికారులు ఉన్నారు.

గడపగడపలో ఆత్మీయ ఆదరణ

విశాలాంధ్ర - నర్సీపట్నం: మున్సిపాలిటీ పరిధిలోని కొత్త వీధిలో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. శాసన సభ్యులు పెట్ల ఉమా శంకర్ గణేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ హాజరయ్యారు. కో ఆప్షన్ సభ్యుడు లగుడు అయ్యప్ప స్వామి, కిల్లాడ లోవ ఆధ్వ ర్యంలో కొత్త వీధి రామ కోవెలలో ఎమ్మెల్యే గణేష్ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ వార్డు ప్రజలు ఎమ్మెల్యే గణేష్‌కు అపూర్వ స్వాగతం పలికారు. నూతనంగా 80 లక్షలు వ్యయంతో నిర్మించిన అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం ఏడవ వార్డులో ప్రతి ఇంటికి తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కొత్త వీధిలో మరొక సిమెంట్ రోడ్ నిర్మాణానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్టేట్ కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగి నాయుడు, వార్డ్ ఇన్‌చార్జ్ కిల్లాడా లోవ రాజు, సచివాలయాలు కన్వీనర్ తమరన శ్రీనివాస్, వైసీపీ టౌన్ అధ్యక్షులు ఏకశివ, మహిళ విభాగం అధ్యక్షురాలు గనమ్మ, ప్రధాన కార్యదర్శి గంటా లలిత నాయకులు కొణతాల వరలక్ష్మి, కణితి అన్నపూర్ణ, శారద, దేవత అరుణ, దాడి బుజ్జి, మామిడి శ్రీను, చోటి, కర్రి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కమనీయంగా ఆర్జిత సేవలు

విశాలాంధ్ర - సింహాచలం: దేశ, విదేశాలతో పాటు ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆర్జిత సేవలు ఏఈఓ వై.సూర్య భ్రమరాంబ, పర్యవేక్షకులు సునిల్ పర్యవేక్షణలో కమనీయంగా జరిగాయి. అర్చకులు, వేద పండితులు వేకువ జామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ స్వర్ణ పుష్పార్చన, నిత్య కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా స్వామి వారి ఆర్జిత సేవలలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

జనసేన సిద్ధాంతాలను ప్రజలకు చేరువ చేయాలి

విశాలాంధ్ర - కె.కోటపాడు: జనసేన సిద్ధాంతాలను ప్రజలకు వివరించి పార్టీలో చేరే విధంగా కృషి చేయాలని మాడుగుల నియోజకవర్గ జనసేన నాయకులు రాయపురెడ్డి కృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని గొట్లాం గ్రామ యువతకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తున్నాయని యువకులు ఇప్పటినుండే జనసేన పార్టీలో అధిక సంఖ్యలో ప్రజలు చేరటానికి ప్రయత్నించాలన్నారు. అధికార పార్టీ నాయకులు చేస్తున్న అక్రమాలపై జనసేన కార్యకర్తలు ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నాయకులు కుంచ అంజిబాబు, ఉగ్గిన త్రినాథ్, గ్రామ జనసేన నాయకులు గోల్డ్ గోవిందు, మజ్జి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా విధానంలో ఏయూ విప్లవాత్మక మార్పులు...!

- టెక్, స్టార్టప్, ఇంక్యుబేషన్ హబ్‌గా వర్సిటీ
ఆ హబ్ ప్రారంభోత్సవానికి సీఎం జగన్మోహన్ రెడ్డి రాక

విశాలాంధ్ర - విశాఖ సిటీ: విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసి వారిని భవిష్యత్తు సాంకేతిక రంగ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నూతన విద్యా విధానంతో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇటీవల రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించి ప్రపంచ విద్యకు చేరువ చేసే విధంగా రాష్ట్ర విద్యారంగ విధానాన్ని పూర్తిగా మార్చి వేసే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్, విద్యా రంగ నిపుణులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ తమ వర్సిటీలు సాధిస్తున్న ప్రగతిని పలు యూనివర్సిటీల వీసీలు సీఎంకు వివరించారు. ఈ మేరకు ఏయూలో అవలంబిస్తున్న పలు విధానాలను వీసీ ఆచార్య పీవీ జీడీ ప్రసాదరెడ్డి సీఎంకి వివరించారు. 2019లో ఏయుకి విచ్చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డి ఉన్నత విద్యలో విద్యార్థులు రాణించడమే కాకుండా వర్సిటీలో విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థి ఉద్యోగం పొందడం, లేదా ఇతరులకు ఉపాధి కల్పించే వ్యక్తిగా తయారు కావాలని సీఎం ఆకాంక్షించారని, ఈ మేరకు తాము పనిచేస్తున్నట్టు వీసీ వివరించారు. వర్సిటీలో పలు అంకుర సంస్థలను ఏర్పాటు చేశామని చెప్పారు. రూ.15 కోట్ల ఎక్విప్‌మెంట్‌తో ఎలిమెంట్ పేరుతో ఫార్మా రంగంలో తీసుకొస్తున్న ప్రాజెక్టు వివరాలు చెప్పారు. అదే ప్రాజెక్టులో ఫుడ్ టెక్నాలజీ, ఫార్మా టెస్టింగ్ లేబరేటరీ, బయలాజికల్ మానిటరింగ్ విభాగాల పనితీరు గురించి విశదీకరించారు. ఆ హబ్ పేరుతో ఏయూలో ఏర్పాటుచేసిన స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్ గురించి తెలిపారు. ఇప్పటికే ఆ సెంటర్‌లో 102 సాఫ్ట్ వేర్ కంపెనీలు పనిచేస్తున్నట్టు వివరించారు. అదేవిధంగా ఇంజనీరింగ్ కోర్సులో నూతన విధానాన్ని అమలు చేస్తున్నామని, పలు బ్రాంచ్‌లకి సంబంధించి అనేక మార్పులు తీసుకు వస్తున్నట్టు సీఎంకు వివరించారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ఇంజనీరింగ్‌లో కేవలం ఒక విభాగానికి పరిమితం చేయకుండా అన్ని బ్రాంచీలకు వర్తింపచేసేలా నిర్ణయించామన్నారు. ఇంజనీరింగ్ ఐటి పై పేరుతో ప్రతి బ్రాంచ్ లోను ఐటీ రంగాన్ని మిళితం చేసామన్నారు. ఇంజనీరింగ్ పలు విభాగాలలో మొదటి సంవత్సరం నుంచి వాటర్, బ్యాటరీ టెక్నాలజీ లను జోడించి గ్రీన్ కెమిస్ట్రీ ను బోధించే విధానాన్ని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్‌ను విద్యలో ప్రధాన భాగంగా అనుసరిస్తున్న తీరును వివరించారు. నూతన కరిక్యులమ్ విధానాన్ని అవలంబిస్తూ విద్యార్థుల్లో నైపుణ్య అభివృద్ధి జరిగేలా పలు చర్యలు తీసుకున్నామన్నారు. వర్సిటీలో ఏర్పాటు చేసిన టిడిఆర్ హబ్, ఎల్గార్గం తదితర విభాగాల గురించి వివరిస్తూ ముఖ్యమంత్రిని వర్సిటీకి ఆహ్వానించారు. సానుకూలంగా స్పందించిన సీఎం ఆ హబ్ ప్రారంభోత్సవానికి ఏయూకి వస్తున్నట్టు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా విశాఖ నగరానికి చెందిన మోకా విజయ్ కుమార్ సిరి ధాన్యాలతో తయారుచేసిన సీఎం దంపతుల చిత్రపటాన్ని వీసీ ఆచార్య ప్రసాద రెడ్డి సీఎంకు అందజేశారు.

కొత్త ఓటర్లు చేరికపై టీడీపీ శ్రేణులు దృష్టిసారించాలి

మాజీ ఎమ్మెల్యే పీలా

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: తమ ప్రాంతాలలో 18 ఏళ్ళు నిండిన యువత కొత్త ఓటర్ల చేరికపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాలని మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జి పీలా గోవింద సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ నెల 21 నుండి ఎన్నికల సంఘం పెట్టిన ఓటర్ వెరిఫికేషన్ స్పెషల్ డ్రైవ్‌లో టీడీపీ నాయకులు పాల్గొవాలని కోరారు. ఓటరు వెరిఫికేషన్‌పై ప్రతి బూత్‌లో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కష్ట సుఖాలు తెలుసుకోవడానికే కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు. పట్టణంలో జీవీఎంసీ 83వ వార్డు లక్ష్మీదేవి పేటలో (పాత 3,4వార్డుల) కార్యకర్తలతో 83వ వార్డు ఇన్‌చార్జి బొద్దపు ప్రసాద్, కర్రి గోపి, లక్ష్మీదేవి పేట టీడీపీ శ్రేణుల ఆధ్వర్యంలో జరిగిన కాఫీ విత్ క్యాడర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 18ఏళ్ల నిండిన వారిని కొత్త ఓటర్ల చేరికపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాలన్నారు. జగన్ రెడ్డి ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాలరాస్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి సబ్బవరపు గణేష్, కర్రి గోపి, పెంటకోట శ్రీనివాసరావు, దొడ్డి రాము, కొణతాల శ్రీనివాసరావు, ముకుందా, వెంకటేష్, పరవాడ సురేష్, వాసు, 83వ వార్డు నాయకులు, పాత 3,4 వార్డుల టీడీపి నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - పరవాడ: స్నేహితులతో కలిసి సరదాగా సముద్రంలో ఈతకు దిగి గల్లంతైన విద్యార్థి మృతదేహం తిక్కవానిపాలెం సమీపంలో బయట పడింది. అనకాపల్లి బీఆర్‌టీ కాలనీకి చెందిన కేదార్‌శెట్టి గౌతమ్‌శివ (16) శనివారం మధ్యాహ్నం తిక్కవానిపాలెం తీరంలో ఈతకు దిగి గల్లంతైన సంగతి తెలిసిందే. ఇతను అనకాపల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. స్నేహితుడు తుట్టాజగన్ పుట్టినరోజు కావడంతో సరదాగా గడిపేందుకు మొత్తం 12 మంది నాలుగు ద్విచక్రవాహనాలపై 2.30 గంటల సమయంలో పరవాడ మండలం తిక్కవానిపాలెం తీరానికి వచ్చారు. ఒడ్డున కాసేపు అందరూ సరదాగా గడిపారు. 3గంటల సమయంలో గౌతమ్‌శివ మరో ముగ్గురు సముద్రంలో ఈతకు దిగారు. ఈ క్రమంలో శివ గల్లంతవగా మిగతా వారు ఒడ్డుకు చేరుకున్నారు. సమాచారం అందుకున్న పరవాడ పోలీసులు తీరానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. విద్యార్థి ఆచూకీ లభ్యం కాలేదు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపి తిరిగి ఆదివారం ఉదయం నుంచి గాలింపు చేపట్టగా తీరం సమీపంలోనే విద్యార్థి మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ట్రిపుల్ ఐటీకి రోహిత్ ఎంపిక

విశాలాంధ్ర - కశింకోట: మండలంలోని తాళ్లపాలెం హైస్కూల్ విద్యార్థి వానపల్లి రోహిత్ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ మేరకు సదరు విద్యార్థినిని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి సుమస్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థులు చదువుతోపాటు ఆటలు పాటల్లో కూడా రాణించాలన్నారు. విద్యార్థినిని ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు.

బీసీలకు వైసీపీ పెద్దపేట వేసింది

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖపట్నం బీచ్ రోడ్‌లో ఉన్న ఏయూ కన్వెన్షన్ సెంటర్ హాల్‌లో విశాఖ బీసీ గర్జన కార్యక్రమం ఆదివారం విశాఖలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీటీడీ చైర్మన్, ఉత్తరాంధ్ర వైసీపీ ఇన్చార్జి వైవి సుబ్బారెడ్డి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ, సినిమాటోగ్రఫీ సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బీసీలకు పెద్ద పేట వైసిపి ప్రభుత్వం వేసిందని, అనేక పదవులు బీసీలకు ఇచ్చిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. బీసీల సంక్షేమం కోసం కొట్లాది రూపాయలు నిధులు కేటాయించడమే కాకుండా బీసీలకు అన్ని పదవులు అప్పగించిన ముఖ్యమంత్రి జగనేనన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్యను నేతలంతా గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కోలా గురువులు, బీసీ సంఘం నాయకులు కర్రి వేణుమాధవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ ఫైడ్ ఓపెన్ చదరంగం పోటీలలో విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - వి.మాడుగుల: నెల్లూరులో ఈ నెల 8, 9 తేదీల్లో జరిగిన ప్రపంచ అంతర్జాతీయ చదరంగం పోటీల్లో మాడుగుల విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచారు. ఈ పోటీలకు న్యూజిలాండ్, యుఎస్ఎ, శ్రీలంక, బంగ్లాదేశ్ దేశాల నుంచి ప్లేయర్స్ రావటం జరిగింది. ఈ దేశాల వారితో పోటీ పడి కనీసం 2.5 పాయింట్స్ పొందితే ఫైడ్ ఐడి పొంది తర్వాత ఆడబోయే గేమ్స్‌లో రేటింగ్ ఇవ్వబడుతుంది. మాడుగుల నుంచి వెళ్లిన బద్దు ప్రదీప్ 4 పాయింట్స్, మోల్లి రంజిత్ కుమార్ 3 పాయింట్స్, పినబోయిన యువరాజ్ 3 పాయింట్స్, పినబోయిన ప్రదీప్ చంద్ర 2.5 పాయింట్స్ పొంది ఫైడ్ ఐడి పొందటం జరిగింది. వేరే దేశం వారు ఎలా అయితే ఇండియాకి వచ్చి ఆడగలుగుతున్నారో అలాగే మాడుగుల విద్యార్థులు కూడా వేరే దేశానికి వెళ్లి ఆడటానికి అర్హత సాధించారు. వీరు గత మూడు నెలలుగా వీనస్ కోచింగ్ ఇనిస్టిట్యూట్‌లో తాళపురెడ్డి నాగచంద్ర దగ్గర శిక్షణ పొందారు. ఈ నలుగురిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అభినందిస్తూ వారి చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందించి భవిష్యత్తులో ఇండియా తరుపున ఆడి మరెన్నో విజయాలు సాధించి మన దేశానికి, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. మొవ్వా బుచ్చయ్యచౌదరి, జల్లు కాశీ విశ్వేశ్వరరావు సతీమణి మీనాక్షి, భారత నిర్మాణ సేవ ట్రస్ట్ సభ్యులతో గౌరీపట్టపు మహేష్‌కుమార్ వీరికి ప్రోత్సాహం అందించారు.

శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం నూతన పాలకవర్గం ఏర్పాటు

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 61వ వార్డు పరిధిలోని గల మల్కాపురం యాదవ వీధి వద్ద గల శ్రీ విజ్ఞాన మండలి యాదవ సంఘం నూతన పాలకవర్గాన్ని ఆదివారం సంఘ సభ్యులు కుల పెద్దలు యువత ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు రెండేళ్ల పాటు తన పాలన కొనసాగిస్తారు. సెక్రటరీ చట్టీ శివకుమార్, ప్రెసిడెంట్ నూనెల నాయుడు, క్యాషియర్ ఉరుకుటి యశ్వంత్, వైస్ ప్రెసిడెంట్ గొంప శంకర్, జాయింట్ సెక్రెటరీ పవన్ కళ్యాణ్, అధ్యక్షులు అప్పలరాజు, అదనపు కార్యదర్శి నూనెల ప్రసాద్, అసిస్టెంట్ క్యాషియర్ నూనెల కృష్ణ, సలహాదారులుగా నూనెల రాజు (సాక్షి రాజు)' నూనెల పైడిరాజు (ప్రజాశక్తి)' వైపి భాస్కర్ (భాను), కిల్లాని పైడ్రాజు, శీర చిన్నాజీ ఎన్నిక కాబడినట్లు సంఘ సభ్యులు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

విశాలాంధ్ర - ఆనందపురం: పంటల పెరుగుదలకు, అధిక దిగుబడులకు సామూహికంగా తర్లువాడ పంచాయతీలో నగరపాలెం గ్రామ రైతులతో 80 కేజీలు మీనామృతం తయారీ చేయించడం జరిగింది. యూనిట్ ఇంచార్జి రామారావు మీనామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ మీనామృతం పంటల ఎదుగుదలకు, అధిక దిగుబడులకు ఉపయోగపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ చక్రవర్తి, ఇంట్రనల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ పైడిరాజు, వెంకట లక్ష్మి, సాయి లక్ష్మి, నాగమణి, రైతులు పాల్గొన్నారు.

ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో రేవంత్ ప్రతిభ

విశాలాంధ్ర - భీమిలి: విశాఖ మద్రిపాలెంలో గల అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆనందపురం గ్రామానికి చెందిన కుప్ప రేవంత్ కుమార్ (6) ఆనందపురంలో గల విక్టరీ సూటొకాన్ కరాటే అకాడమీ టి.సాయి కుమార్ కోచ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నాడు. మద్రిపాలెంలో జరిగిన సౌత్ ఇండియా ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్‌లో పాల్గొని కరాటే ఖాతా విభాగంలో ఫస్ట్ ప్రైజ్ గోల్డ్ మెడల్ సాధించి, కుంతీ విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. కుప్ప రేవంత్ కుమార్ ఆనందపురం గ్రామానికి చెందిన వాడు కాగా తాళ్లవలసలో గల తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూల్లో రెండవ తరగతి చదువుతున్నాడు. అదేవిధంగా తల్లిదండ్రులు కుప్ప రాజశేఖర్, కుప్ప రామలక్ష్మి చదువుతోపాటు రేవంత్‌కుమార్‌కు ఆటపాట స్పోర్ట్స్ ఎంతో ముఖ్యమని విక్టరీ సూటొకాన్ కరాటే అకాడమీలో చేర్పించారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు కృషి చేయండి

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలుగా బాధ్యతలు చేపట్టిన డి.పురందేశ్వరిని విశాఖ ఉక్కు అధికారుల సంఘం కలిసి విజ్ఞప్తి చేసింది. ఉక్కుకర్మాగారాన్ని స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో పున: విలీనం చేయడానికి ప్రభుత్వాన్ని ఒప్పించే విధంగా కృషి చేయాలని కోరారు. 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేటువరం చేయడం సరైన నిర్ణయం కాదని దానికన్నా విశాఖ ఉక్కును స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో పున విలీనం చేయడం ద్వారా విశాఖ ఉక్కును కాపాడవచ్చన్నారు. ఉక్కు పరిశ్రమను ప్రాధాన్యత రంగంలో ఉంచాలని ఆ విధంగా పాలసీ చేయడానికి ప్రధానమంత్రిని కలిసి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. 2019 నుండి అధికారులకు ప్రమోషన్స్ నిలిపివేయడం వల్ల విశాఖలో పనిచేస్తున్న 5000 మంది చాలా అసంతృప్తిగా ఉన్నారని దానికి తోడు 2017 నుంచి వేతన ఒప్పందం కూడా జరగకపోవడం వలన చాలామంది అధికారులు ఈ కర్మాగారం విడిచి వెళ్ళిపోతున్నారని అన్నారు. ఈ సమావేశంలో విశాఖ ఉక్కు అధికారులు సంఘం అధ్యక్షుడు కాటం ఎస్ఎస్ చంద్రరావు, ప్రధాన కార్యదర్శి కేవీడీ ప్రసాద్, సంయుక్త కార్యదర్శి నరసింహ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎం.సత్యనారాయణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

SBFC | SMALL BUSINESS FINCREDIT

ఎస్‌బిఎఫ్‌సి ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్

రిజిస్టర్డ్ ఆఫీస్ : యూనిట్‌నం: 103, 1వ అంతస్తు, సి&బి స్క్వేర్, సంగం కాంప్లెక్స్, సిటిఎస్ సం.95ఎ, 127, అంధేరి కుర్లా రోడ్, చాకాల గ్రామం, అంధేరి(ఇ),ముంబై-400059, టెలిఫోన్ : +91 22 67875300, ఫ్యాక్స్: +91 22 67875334 , WWW.SBFC.COM), కార్పొరేట్‌గుర్తింపుసంఖ్య : యు67190ఎంహెచ్2008పిటిసి178270

బహిరంగ ప్రకటన

దిగువ పేర్కొన్న బ్రాంచ్ చిరునామా వద్ద తాకట్టు పెట్టబడిన బంగారు ఆభరణాలు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా **తేదీ: 25 జులై, 2023- ఉదయం 10.30 గంటలకు కింది బ్రాంచ్ చిరునామాలో** వేలం వేయబడునని ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయడమైనది.
వేలం వేయబడు బంగారు ఆభరణాలు, బకాయిలు చెల్లించుటలో విఫలమైన మా యొక్క వేర్వేరు ఖాతాదారుల లోన్ ఎక్కౌంట్లకు చెందినవి. ఈ రుణగ్రహీతలకు మా నుంచి వేలం నోటీసులు సక్రమంగా జారీ చేయబడినవి. వేలానికి పెట్టిన బంగారు ఆభరణాలు...ఈ కింద పేర్కొన్న బ్రాంచి వివరాలతో పాటు వేర్వేరు ఖాతాదారుల కస్టమర్ ఐడీతో అనుసంధానమై ఉన్న అన్ని ఎక్కౌంట్లకు చెందినవి.

వైజాగ్ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, డోర్ నెం.43-9-205, గ్రౌండ్‌ఫ్లోర్, సుబ్బలక్ష్మీనగర్, మోర్ సూపర్‌మార్కెట్ ఎదుట, భగీరథ హోటల్ పక్కన, దొండపర్తి.
వైజాగ్:AP00081651,AP00125734,AP00158812,AP00208183,AP00351906,AP00352849,AP00354371,AP00363401,AP00376774,AP00386030,AP00410237, AP00414611,AP00415115,AP00422663,AP00481445,AP00485829,AP00488246,AP00512525,AP00518717,AP00519685,AP00533541

కాకినాడ బ్రాంచ్ చిరునామా: ఎస్‌బీఎఫ్‌సీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, 13-1-46, 1వ అంతస్తు, శ్రీ దీప్తి టవర్స్, చందన బ్రదర్స్ పక్కన, మెయిన్ రోడ్, కాకినాడ-533001
కాకినాడ AP00512714, AP00512821

మరిన్ని వివరాల కొరకు, దయచేసి ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క సంప్రదించు నంబరు(లు) : 18001028012 నందు సంప్రదించగలరు. (వేలం వేయబడు ఖాతాల సంఖ్యలు మార్చుటకు & ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండానే వేలాన్ని వాయిదా/రద్దు చేయుటకు ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హక్కు కలిగియున్నది.

వలసపల్లి గ్రామస్తులకు రోడ్డు కష్టాలు

విశాలాంధ్ర - సీలేరు: జికేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని వలసగెడ్డ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో ఈ ప్రాంత గిరిజనులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామం ఏర్పడి ఐదు దశాబ్ధాలు దాటినప్పటికీ రహదారి సౌకర్యం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వలసగెడ్డ గ్రామం వెళ్లాలంటే ప్రధాన రహదారి నుంచి అటవీ మార్గంలో కొండలు, గుట్టలు, వాగులు దాటుకుంటూ సుమారు ఐదు కిలో మీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ గ్రామానికి ఒక్క బైకు తప్ప ఏ ఇతర వాహనం వెళ్లలేవు. బైక్ కూడా వేసవి కాలంలోనే వెళ్లటానికి వీలుంటుంది. వర్షాకాలం అయితే సుమారు రెండు వాగులు ప్రవహిస్తుంటాయి. ఈ గ్రామంలో సుమారు 20 కుటుంబాలు నివాసముంటున్నారు. వీరు రేషన్ తీసుకోవాలన్నా ఎనిమిది కిలో మీటర్ల దూరంలో ఉన్న బాసుకొండ గ్రామానికి వెళ్లాలి. గ్రామంలో ఎవరికైనా అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రి తరలించాలంటే ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రధాన రహదారి వద్దకు డోలిలో తీసుకువస్తే అక్కడ నుంచి అంబులెన్స్‌లో గానీ, ప్రైవేటు వాహనంలో గానీ 10 కిలో మీటర్ల దూరంలో ఉన్న సీలేరు పిహెచ్‌సికి తరలిస్తారు. రహదారి సౌకర్యం లేకపోవడంతో వలసపల్లి గ్రామానికి గత రెండు సంవత్సరాల క్రితం పాఠశాల భవనం మంజూరైనా సామగ్రి తరలించే మార్గం లేక కార్యరూపం దాల్చలేదు. వలసపల్లి గ్రామాన్ని ఆనుకొని మునసపల్లి, పెలిగొప్పు, చింతగొప్పు, కొల్తూరుకోట గ్రామాలు ఉన్నాయి. ఈ ప్రాంతీయులు అపరాల సాగుతో పాటు వరి, కూరగాయలు సాగు కూడా చేస్తుంటారు. ఈ ప్రాంత గిరిజనులు పండించే పంటలను సీలేరు ప్రాంతానికి తీసుకువెళతారు. వీరికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో పండించే పంటలను సీలేరు తరలించాలన్నా, వీరికి కావలసిన నిత్యవసర సరుకులను తెచ్చుకోవాలన్నా కాలినడకనే కొండలు, వాగులు, గెడ్డలు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుంది. గ్రామానికి రహదారి నిర్మించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను పలుమార్లు వేడుకున్నా ఫలితం లేకపోయింది. దీంతో గ్రామ ఆవసులకు ఇబ్బందులు తప్పడం లేదు.

పవన్‌తో పంచకర్ల భేటీ

20న జనసేనలో చేరుతానని ప్రకటన..

విశాఖలో వేగంగా మారుతున్న రాజకీయ సమీకరణలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: విశాఖలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారిపోతున్నాయి. జనసేనలో పంచకర్ల చేరిక ఆ పార్టీకి పెద్ద ప్రయోజనమే చేకూరుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. విశాఖ రాజధానిగా పాలన అందిస్తామని వైసీపీ చెప్తున్నా ఆ పార్టీని ఎవ్వరూ నమ్మడం లేదు. ప్రజలతో పాటు ఆ పార్టీ నేతలు కూడా జగన్ మాటను వినే పరిస్థితులు కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఇటీవల వైసీపీకి రాజీనామా చేశారు. త్వరలో ఆయన పవన్ కళ్యాణ్ పార్టీలో చేరనున్నారు. ఈ మేరకు పంచకర్ల రమేష్‌బాబు జనసేనలోకి వెళ్లేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో పంచకర్ల రమేష్‌బాబు ఆదివారం తాడేపల్లి లో సమావేశం అయ్యారు. ఈ భేటీ ముగిసిన తర్వాత ఆయన మీడియాతో ప్రత్యేకంగా మాట్లాడారు. తాను ఈనెల 20న జనసేన పార్టీలో చేరుతున్నట్లు పంచకర్ల రమేష్‌బాబు వెల్లడించారు. తాను ఓ సామాన్య కార్యకర్త తరహాలో జనసేన పార్టీలో పనిచేస్తానని ఆయన తెలిపారు. తనకు పవన్ కళ్యాణ్ ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు. తన అనుభవాన్ని పార్టీ ఉపయోగించుకుంటుందని పవన్ కళ్యాణ్ చెప్పారన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఒక్క రూపాయి సంపాదించానని వైసీపీ నేతలు నిరూపిస్తే గొంతు కోసుకుంటానన్నారు. అటు తన ఆత్మాభిమానం దెబ్బతినడంతో వైసీపీని వీడినట్లు పంచకర్ల రమేష్‌బాబు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కూడా సీఎం జగన్‌ను కలిసే పరిస్థితి వైసీపీలో లేదని ఆయన ఆరోపించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉండగా వేరొక అభ్యర్థి పేరును వచ్చే ఎన్నికలకు జగన్ ప్రకటిస్తారని తాను అనుకోనని పంచకర్ల అన్నారు. వైవీ సుబ్బారెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. కాగా విశాఖ జిల్లాలో బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన పంచకర్ల రమేష్ బాబు పోర్టు ఆధారిత వ్యాపారం చేస్తూ 2009 ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి వచ్చారు. చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం తరపున పెందుర్తి నుంచి పోటీ చేసి తొలిసారి విజయం సాధించారు. పీఆర్పీ విలీనం తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యేగా కొనసాగి 2014 ఎన్నికలకు ముందు టీడీపీలోకి జంప్ అయ్యారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో రమేష్ బాబుపై సిట్టింగ్ ఎమ్మెల్యే రమణమూర్తి రాజు విజయం సాధించారు. తనతో పాటు జిల్లాలో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తున్నట్టు టీడీపీ రూరల్ జిల్లా అధ్యక్ష పదవికి రమేష్‌బాబు రాజీనామా చేశారు. ఆ తర్వాత వైసీపీలో చేరగా, ఆయనకు జగన్ జిల్లా అధ్యక్ష పదవి కట్టబెట్టారు. అయితే వచ్చే ఎన్నికల్లో పెందుర్తి నుంచి పోటీ చేయాలని భావిస్తున్న పంచకర్ల రమేష్‌బాబుకు వైసీపీ నుంచి టిక్కెట్ రాదని ప్రచారం జరుగుతుండటంతో ఆయన ఊహించని విధంగా పార్టీకి రాజీనామా చేయడం వైసీపీ వర్గాలకు ఆశ్చర్యం కలిగించింది. ఇక ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేనకు పంచకర్ల రాకతో పెద్ద ఊపునే తీసుకొచ్చిందని జన సైనికులు అంటున్నారు.

కష్టాల్లో తోడుగా ఉంటా

- అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

విశాలాంధ్ర - హుకుంపేట: గిరిజనులు ఆపదలో ఉన్నప్పుడు అన్ని వేళల అండగా ఉంటు కష్టా నష్టాల్లో ఎప్పుడు తోడుగా ఉంటానని అరుకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. ఆదివారం మండలంలోని రంగశీల పంచాయతీ కేంద్రంలో ఆయన స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. మాజీ ఎంపీటీసీ కంబిడి చిన్నబ్బి కుమారుడు ఇటీవల ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఇంట్లోనే విశ్రాంతి పొందు తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే తమ ఇంటివద్దకు చేరుకుని పరామర్శిం చారు. కుటుంబానికి అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీయస్ మండల ఇన్‌చార్జి కిల్లో రామ కృష్ణా, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మెన్ సివేరి కొండలరావు, స్థానిక వైసిపి నాయకులు తాంగుల మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ సంస్కారవంతంగా మాట్లాడాలి

ఏపీ కల్చరల్ కమిషన్ క్రియేటివ్ హెడ్ జోగినాయుడు

విశాలాంధ్ర - నర్సీపట్నం: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట తీరు, సంస్కారవంతంగా ఉంటే మంచిదని , సినీ నటుడు, ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక, కళలు క్రియేటివ్ హెడ్ లోకవరపు జోగి నాయుడు హితవు పలికారు. ఆదివారం నర్సీపట్నం మున్సిపాలిటీలో ఎమ్మెల్యే గణేష్‌తో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంభోదించే తీరు మార్చుకుంటే మంచిదని అన్నారు. సినిమా ఇండస్ట్రీకి మీరు చేసింది ఏమీ లేదని, కోట్ల రూపాయలు రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్టు మీరే చెప్పారని, ఏదో ఉద్ధరించాం ఉద్ధరిస్తాం అన్నట్టుగా ఉత్త మాటలు చెప్పడం దేనికని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ సంస్కారవంతంగా మాట్లాడటం నేర్చుకోవాలని, ఆవేశంతో ఊగిపోతూ, నోటికి ఏది వస్తే అది మాట్లాడటం, సంస్కారవంతులు లక్షణం కాదని అన్నారు.

మోదకొండమ్మ వారిని దర్శించుకున్న ఉపముఖ్యమంత్రి

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగుల మండలం కేజేపురం గ్రామదేవత శ్రీమోదకొండమ్మ అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి బూడి

ముత్యాలనాయుడు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కాళ్ళ అప్పలనాయుడు, సహకార సంఘ అధ్యక్షుడు కాళ్ళ రాము గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జనసేన వారాహి యాత్రను విజయవంతం చేయాలి

రాష్ట్ర అధికార ప్రతినిధి పరుచూరి

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: త్వరలో నియోజకవర్గంలో జరగనున్న వారాహి విజయ యాత్రను సమిష్టి కృషితో విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అనకాపల్లి నియోజకవర్గం ఇంచార్జ్ పరుచూరి భాస్కరరావు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని గ్రామ స్థాయి కమిటీ సభ్యులతో పార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో భాస్కరరావు మాట్లాడుతూ వచ్చే వారం నుండి ప్రతీ గ్రామంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఓటు హక్కు పరిశీలన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయిలో ఉన్న సమస్యలను వెలికితీసి దానిపై పోరాడాలని పిలుపునిచ్చారు. ఇందుకుగాను తాను సైతం గ్రామాల్లో పర్యటిస్తానని తెలిపారు. జనసైనికుడి సూచన మేరకు ప్రతీ జనసైనికుడు హలో ఏపీ బైబై వైసీపీ రింగ్ టోన్ పెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఇదే సమావేశంలో అందరూ రింగ్ టోన్ పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలో లింగరాజుపాలెం గ్రామం సమీపంలో చెరువులో మట్టి అక్రమంగా తవ్వకాలు జరుగుతున్నాయి. శనివారం అర్ధరాత్రి చెరువు నుంచి జెసిబి తో మట్టి తవ్వకాలు జరిపి ట్రాక్టర్లు తో రవాణా చేసారు. ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ఈ తవ్వకాలు జరిగితే కనీసం అధికారులు పట్టించుకోకపోవడం పలువురు విమర్శిస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు పై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: సరదాగా స్నానానికి సముద్రంలో దిగిన యువకుడు అలల తాకిడి ఎక్కువగా ఉండటంతో కొట్టుకుపోవడంతో ఒక్కసారిగా అప్రమత్తమైన స్థానికులు అంతా పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అక్కడే ఉన్న బీచ్ లైఫ్ గాడ్స్ ఆ యువకుడ్ని రక్షించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన దీవక్ (26)గా గుర్తించారు. యువకుడు ప్రాణాలను బీచ్ లైఫ్ గార్డ్స్ నవీన్, పోలీరాజు, ధనరాజు కాపాడారు.

రోడ్డు కోసం జనసైనికుల ఆందోళన

విశాలాంధ్ర - పెందుర్తి: సబ్బవరం మండలం దువ్వాడ రైల్వే స్టేషన్ నుండి వెదుళ్ల నరవ, ఈ గంగవరం, అజనగిరి గ్రామాలకు రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని జనసైనికులు ఆందోళన చేపట్టారు. అజనగిరి నుండి కొత్తూరు వెదుళ్ల నరవ వరకు వందల సంఖ్యలో జనసైనికులు, ప్రజలు పాదయాత్ర చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు వబ్బిన జనార్ధన శ్రీకాంత్ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే అదీప్ రాజ్ 7 రోజుల్లో రోడ్డుకు శంకుస్థాపన చేస్తానని సోషల్ మీడియాలో ప్రకటనలు చేసి 3 సంవత్సరాలు గడిచినప్పటివరకు రోడ్డు పనులు ప్రారంభించలేదని విమర్శించారు. వైఎస్ఆర్సిపి ప్రభుత్వం పాలనలో రోడ్లు సరిగా లేకపోవడం వల్ల ప్రతిరోజు ఏదో ఒక చోట యాక్సిడెంట్ జరిగి వాహనదారులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు చోడవరం, సబ్బవరం మండలాల ప్రజలు రైల్వే స్టేషన్, గాజువాక వెళ్లడానికి ప్రధానమైన రహదారి అని పేర్కొన్నారు. ఇటువంటి రోడ్డును చిన్నచూపు చూడడం వైసీపీ పరిపాలన దక్షతకు నిదర్శనం అని ఎద్దేవా చేసారు. నెల రోజులలో అధికారులు రోడ్డు పనులు మొదలు పెట్టకపోతే జనసేన పార్టీ ఆధ్వర్యంలో మరమ్మత్తులు చేసి ప్రజలకి రోడ్లు అందుబాటులోకి తీసుకుని వస్తామని స్పష్టం చేసారు. జనసేన పార్టీ ప్రభుత్వం రాగానే ప్రభుత్వ నిధులతో ఈ రోడ్డును పూర్తిగా బాగు చేస్తామని తెలిపారు. స్థానిక కార్పొరేటర్ మల్లు ముత్యాల నాయుడు బాధ్యత తీసుకొని వెదుళ్ల నరవ, పరిసర గ్రామ ప్రజలకు సురక్షితమైన రోడ్డును అందు బాటులోకి తీసుకోనిరావాలని కోరారు. మీ ఇంటి ముందే పెద్ద గొయ్యి ఉన్న ఇప్పటివరకు మరమత్తులు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సామాన్యుడిలాగా పేపర్ల ప్రకటనలకే మీరు పరిమితం అవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దుబాయ్ రాజ్, గంగవరం రాజు, గోపి, ప్రసాద్, అప్పారావు, రమణ, వరహాలు, కృష్ణ, నాగరాజు, బొడ్డు నాయుడు, గవర శ్రీను, జన సైనికులు ప్రజలు పాల్గొన్నారు.

అధాని పోర్టు కార్మికుల దీక్షకు పులి సంఘీభావం

విశాలాంధ్ర - పెదగంట్యాడ: గంగవరం (అధాని) పోర్టులో నిర్వాసిత కుటుంబాలకు చెందిన కార్మికులకు 36,000/- కనీస వేతనం ఇవ్వాలని, అలాగే విధుల నుండి తొలగించిన నిర్వాసిత కార్మికులను భేషరతుగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్వాసిత కుటుంబాలు కార్మికులు గత పదమూడు రోజులుగా పెదగంట్యాడ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షా శిబిరాన్ని ఉక్కు నిర్వాసిత నాయకులు, విశాఖ

పార్లమెంటరీ నియోజక వర్గ టీడీపీ ఉపాధ్యక్షులు పులి వెంకట రమణారెడ్డి సందర్శించి సంఘీభావం తెలిపారు. నిరాహార దీక్షకు ఉక్కు నిర్వాసితుల, తెలుగుదేశం పార్టీ మద్దతు పూర్తిగా ఉంటుంది అని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, ఉక్కు నిర్వాసిత నాయకులు పాల్గొన్నారు.

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిపై నిందారోపణలు తగదు

సర్పంచ్ రమేష్ నాయుడు

విశాలాంధ్ర - చింతపల్లి : బలవం పంచాయతీలో ఈనెల 13న నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వర్షం అడ్డంకిగా మారడం వల్లనే కుదుముల గ్రామాన్ని సందర్శించడం వీలు కాలేదని ఆ పంచాయతీ సర్పంచ్ కొర్ర రమేష్ నాయుడు అన్నారు. ఈ పర్యటనలో శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి కుదుముల గ్రామానికి రాలేదని ఆ పంచాయతీ మాజీ సర్పంచ్ గబులంగి అప్పారావు ఆరోపించడం తగదన్నారు. ఆ పంచాయతీ.ఉప సర్పంచ్ కామరాజు, వైకాపా నాయకుడు బచ్చల బాబురావులతో కలిసి ఆదివారం కుదుముల గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామస్తులకు గడపగడపకు సంబంధించిన పూర్తి వివరాలు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 13న విపరీతంగా వర్షం కురవడం వలన కుదుముల గ్రామానికి వెళ్లేందుకు వర్షం సహకరించలేదని, బూరుగు బయలు గ్రామం వరకే గడవగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, త్వరలోనే కుదుముల గ్రామంతో పాటు మరికొన్ని గ్రామాలను సందర్శించేందుకు పాడేరు శాసన సభ్యురాలు కొట్టగుళ్ళి భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారని తెలిపారు. గత ప్రభుత్వాలు బలపం పంచాయతీని హీనంగా చూశారని, నేడు వైకాపా ప్రభుత్వం బలపం పంచాయతీని అభివృద్ధి పరిచేందుకు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పుడిప్పుడే తమ పంచాయతీ పరిధిలోకి అధికారులు, నాయకులు సందర్శించి గ్రామాలలో నెలకొన్న సమస్యలు అడిగి తెలుసుకుని క్లుప్తంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అటువంటి తరుణంలో ప్రభుత్వంపై, శాసన సభ్యురాలుపై నిందారోపణలు చేయడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో బలపం సచివాలయం కన్వీనర్లు గబులంగి మోహన్ రావు, సత్యనారాయణ, గ్రామ వాలంటీర్ అనుగురు శ్రీను బాబు, చుట్టుపక్కల గ్రామస్తులు బొరుబోజి లక్ష్మణరావు, లువ్వాబు సన్యాసి దొర, గ్రామస్తులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు

విశాలాంధ్ర - తగరపువలస: భవిష్యత్తులో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వాస్తవ సేవా సంఘం అధ్యక్షుడు పిట్టా సురేష్ అన్నారు. ఆదివారం కొత్తపేట కార్యాలయంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న రోజుల్లో వాస్తవ సేవా సంఘం ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ ద్వారా పేదలకు, బడుగు బలహీన వర్గాలకు, అసంఘటిత కార్మికులు భీమా మరియు ఇతర ప్రయోజనాలు పొందేందుకు నమోదు కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో వాస్తవ సేవా సంఘం సభ్యులు బల్ల వెంకటరావు, గుదే నానాజీ, భీమవరపు ప్రకాష్ రావు, దీవి రామకృష్ణ, పతివాడ శ్రీనివాసరావు, తమ్మిన సూర్యప్రకాశ్రావు, పిల్ల రాజేష్, జోగ సన్యాసిరావు, వల్ల అప్పలకొండ, అవనాపు శ్రీనివాసరావు, ఉండవల్లి చంద్ర, ఆర్మీ దుర్గ, ముత్యాల వెంకటేశ్వరరావు, పిట్ట తోటయ్య, వూళ్ల దుర్గారావు, పిట్ట రామారావు తదితరులు పాల్గొన్నారు.

యూసీసీపై కేంద్రం తొందరపాటు తగదు

విశాలాంధ్ర - సీలేరు: కేంద్ర ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫైడ్ సివిల్ కోడ్)ని తీసుకొని రావాలని చూస్తుండటం దేశంలో గల మహిళలు, వెనుకబడిన తరగతులకు చెందిన వారు, దళితులు, గిరిజనులలో ఉమ్మడి పౌరస్మృతి(యుసిసి) పట్ల అనేక అనుమానాలు, అపోహలు, సందేహాలు వ్యక్తమతున్నాయని భారతీయ ఆదివాసుల సమాఖ్య ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గదుతూరి రామగోపాల్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భారత రాజ్యాంగ మహిళా రక్షణ కోసం కల్పించిన చట్టాలు, గృహహింస వ్యతిరేకచట్టం 2005, వరకట్న నిషేద చట్టం 1961, ఇండిసెంట్ రిప్రజెంటేషన్ ఆఫ్ ఉమన్(ప్రొహిబిషన్) యాక్టు 1986, పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపులు(నివారణ, నిషేదం, పరిహారం) చట్టం 2013, దళితులు, గిరిజన తెగల రక్షణ కోసం ఉద్దేశించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు (అట్రాసిటీల నిరోధక) చట్టం 1989, గిరిజన తెగల రక్షణ కోసం ఉద్దేశించిన 1/70 చట్టం, అటవీ హక్కుల పరిరక్షణ చట్టం 2006, రాజ్యాంగంలో గిరిజన తెగల కోసం ఏర్పాటు చేసిన 5వ షెడ్యూల్, 6వ షెడ్యూల్, వెనుకబడిన కులాల హక్కులు పరిరక్షణకు ఉద్దేశించిన చట్టాలు ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి వస్తే ఉంటామో ఉండవో అనే సందేహం ఆయా వర్గాలలో ఆందోళన కలిగిస్తుందన్నారు. రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలోకి ఆర్టికల్ 44లో ఈ ఉమ్మడి పౌరస్మృతిని ప్రస్తావించారని, దేశ ప్రజల ఉమ్మడి పౌరస్మృతి కోసం ప్రయత్నం ప్రయత్నించాలని పేర్కొన్నారు. అయితే ఈ అంశంలో ఉన్న సున్నితత్వాన్ని గ్రహించిన రాజ్యాంగ రూపకర్తలు ఉమ్మడి పౌరస్మృతి అమలు చేసే విషయంలో ప్రభుత్వానికి స్వేచ్ఛనిచ్చాయన్నారు. బిజెపి కన్నా ముందు కేంద్రంలో అధికారంలో ఉన్న చాలా ప్రభుత్వాలు చాలా సార్లు ఈ ఉమ్మడి పౌరస్మృతిపై చర్చలు జరిపారన్నారు. కానీ ఉమ్మడి పౌరస్మృతి కార్యరూపం దాల్చలేదన్నారు. ఎందుకంటే దీనికి అమలు చేయడం చాలా కష్టమనే చెప్పుకోవాలన్నారు. ఎందుకంటే ఎన్నో మతాలు, విభిన్న ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాల వంటి భిన్నత్వాలకు నెలవు మన భారతదేశమని, ఇక్కడ చాలా అంశాలు మతాలు, ఆచార వ్యవహహారాలతో ముడిపడి ఉంటాయన్నారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులకు వేర్వేరు చట్టాలు ఉన్నాయన్నారు. పెళ్లి నుండి విడాకుల వరకు, ఆస్తి పంపకం నుండి డబ్బు విషయం వరకు అన్నింటికి వేర్వేరు చట్టాలు ఉన్నాయన్నారు. ఈ అంశాలన్నింటిపై ప్రభుత్వం ప్రజలతో విస్తృతంగా చర్చించి నిర్ణయం తీసుకుంటే మంచిదన్నారు. అలా కాకుండా ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేవలం రాజకీయ లబ్ధికోసమే ఇటువంటి వాటిని తీసుకొని వస్తే ఉపయోగం ఉండని రామగోపాల్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

మహిళలపై వైసీపీ ప్రభుత్వం గౌరవం లేదు

రాష్ట్ర తెలుగు మహిళ అధ్యక్షురాలు అనిత

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: వైసిపికి మహిళలపై గౌరవం లేదు అని రాష్ట్ర తెలుగు మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. ఆదివారం విశాఖ జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో అనిత మాట్లాడుతూ టిడిపి అడుగుతున్న ప్రశ్నలకు వైసిపి సమాధానాలు చెప్పలేకపోతుందని అన్నారు. టిడిపి ఇతర పార్టీల మహిళల పై కించ పరిచేలా వాఖ్యలు చేస్తున్నారు అని అన్నారు. మద్యపాన నిషేధం ఎప్పుడు చేస్తారు అని చెప్పమంటే చెప్పలేరు పైగా స్త్రీ జాతి వినలేని మాటలు మాట్లాడుతున్నారు. నాపై అత్యంత హేయమైన వ్యాసాలు రాసి భాద పెడుతున్నారు నోటికి వచ్చిన దారుణమైన పద జాలం వినియోగిస్తున్నారు. నాపై కూడ అనేక జుగుప్స కరమైన రాతలు రాయిస్తోంది భారతి స్వయంగా సీఎం సలహాదారు సజ్జల రామ కృష్ణా రెడ్డి కుమారుడు సజ్జల భార్గవ రెడ్డి సోషల్ మీడియా లో వ్రాతలు వ్రాయిస్తున్నారు అని చెప్పారు ఒక ఆడబిడ్డ మీద ఇలాంటి వ్రాతలు ఎలా రాస్తారు అని అన్నారు. నేను ఈ విషయాలు మీద ఫిర్యాదుకు పోలీస్ డిజిపి అడిగితే అపోయింట్ మెంట్ ఇవ్వలేదని, సీఎం ను ప్రశ్నించడమే నేను చేసిన తప్పా నేను ఎంతో బాధ పడ్డాను కానీఎడవను ఈపోస్టులు పెట్టిన వారు ఎడిపించే రోజు వస్తుంది మాకు చదువుకున్న దళిత ఆడబిడ్డను నేను నాకు అండగా నిలిచింది చంద్రబాబు అని అన్నారు. మహిళా సమస్యల మీద మేము పోరాటం చేస్తుంటే వైసిపి సోషల్ మీడియా గజ్జి కుక్కలు మొరుగుతున్నాయని, పేటీఎం డాగ్స్ నోటికి వచ్చినట్లువాగుతున్నాయన్నారు. సమావేశంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, తెలుగు మహిళా నాయకురాలు కేదారి లక్ష్మి, ఈతలపాక సుజాత, గణగళ్ళ సత్య, తోట శ్రీదేవి పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం: జాన్‌వెస్లీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అల్లిపురంలో క్రౌన్ గోస్పల మినిస్ట్రీస్ చారిటబుల్ నిర్వాహకులు రెవరెండ్ రమేష్ పాల్ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్ ఘనంగా జరిగింది. ఈ యొక్క మెడికల్ క్యాంపునకు ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ బొల్లవరపు జాన్ వెస్లీ పాల్గొని మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జాన్ వెస్లీ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని ప్రతి ఒక్కరూ తెలుసుకొని తమ ఆరోగ్యం విషయంలో శ్రద్ధ తీసుకొని తమ జీవన ప్రమాణాన్ని మెరుగుపరుచుకోవాలని కోరారు. మానవ జీవితం ఎంతో ఉత్కృష్టమైనదని అలాంటి జీవితాన్ని అశ్రద్ధ చేసి ఆరోగ్యం పాడు చేసుకోరాదని తెలియజేస్తూ,అనారోగ్యం వచ్చిన తర్వాత హాస్పటల్ వెళ్లడం కంటే ముందుగానే వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవలసిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు. ప్రతి వ్యక్తి క్రమం తప్పకుండా నడక గాని వ్యాయామం గాని తమ వయసుకు అనుగుణంగా చేయాలని అప్పుడే మన అవయవాలు అన్ని ఆరోగ్యంగా ఉంటాయని, అదే విధంగా ఆహారం విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని బ్రతకడం కోసమే మనం ఆహారం తీసుకోవాలని అంతేగాని ఆహారం కోసమే బ్రతకడం నేర్చుకోకూడదని తెలియజేస్తూ, మన పూర్వీకులు ఆరోగ్యంగా ఉండడానికి కారణం వారు ఎల్లవేళలా కష్టపడి పనిచేయడం వల్ల ఆరోగ్యంగా ఉన్నారని ఇప్పుడు మన సమాజంలో పనిచేయడానికి వ్యక్తులు ఇష్టపడడం లేదని సుఖానికి అలవాటు పడటం వల్ల బద్ధకంతో ఏ పని చేయకపోవడం వల్ల ఒబిసిటీ పెరిగిపోయి వ్యాధులు ప్రతి ఒక్కరిలోనూ వయసుతో నిమిత్తం లేకుండా వస్తున్నాయని, యుక్త వయసుల్లో కూడా గుండెపోటు మరణాలు సంభవిస్తున్నాయని వీటన్నిటికీ కారణం మనలో ఆహారపు క్రమశిక్షణ లేకపోవడమేనని తక్కువ ఆహారం భుజించిన వారు ఎక్కువగా హుషారుగా ఉంటారని ఎక్కువ భుజించిన వారు మత్తుగా బద్ధకంగా ఉంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ జ్యోతి ఆనంద్ , డాక్టర్ సతీష్ ప్రియాంక, గ్రామ సర్పంచి రవి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్‌గా ప్రసాద్

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఎమ్మార్పీఎస్ నర్సీపట్నం నియోజకవర్గ కన్వీనర్‌గా మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామానికి చెందిన బిక్కవోలు ప్రసాద్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల ఎమ్మార్పీఎస్ కన్వీనర్ చినసుబ్బారావు నియామకపత్రం అందించారన్నారు. తనకు అప్పగించిన బాధ్యతను వమ్ము చేయకుండా మాదిగల సమస్యల సాధనకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

శాకాంబరి అలంకరణలో నూకాంబికా అమ్మవారు

విశాలాంధ్ర - యస్. రాయవరం: మండల కేంద్రం యస్. రాయవరం గ్రామంలో నూకాంబికా అమ్మవారిని కూరగాయలతో అలంకరించారు. ఆషాఢమాసం ఆదివారం కావడంతో అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించిన సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దర్శనం చేసుకున్నారు. వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

సచివాలయ మహిళా పోలీసుకు సత్కారం



విశాలాంధ్ర - పరవాడ: ముత్యాలమ్మపాలెం సచివాలయ మహిళా పోలీసు షేక్ జువేరియాకు ఘనసత్కారం లభించింది. గ్రామానికి చెందిన ఓ బాలుడు మిస్సింగ్ కేసులో ఆమె చాకచక్యంగా వ్యవహరించినందుకు గాను ఇటీవల జిల్లా పోలీస్ అధికారుల నుంచీ ప్రశంసలు అందుకున్నారు. ఈ మేరకు ఆదివారం ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో ఆమెను సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జి. సోమనాయుడు, మండల కో ఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, కో-ఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: రోటరీ క్లబ్ ఆఫ్ వైజాగ్ ఎలైట్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ద్రోణంరాజు శ్రీవత్సవ, సి.ఐ దుర్గా ప్రసాద్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ద్రోణం రాజు శ్రీవత్సవ మాట్లాడుతూ విశాఖ సుందర నగరంలో పోర్ట్ స్టేడియం ఆవరణలో అనేక మంది మార్నింగ్ వాకింగ్ కోసం వస్తుంటారని ఇలాంటి ప్రాంతంలో మొక్కలు నాటించే కార్యక్రమం నిర్వహించి పర్యావరణాన్ని అభివృద్ధి చేస్తున్న క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పోర్ట్ వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ యస్. ప్రసాద్ రావు రోటరీ క్లబ్ ఎలైట్ క్లబ్ ప్రెసిడెంట్ తోట దుర్గారావు , సెక్రెటరీ డొక్కా రవీంద్రనాథ్ , ట్రెసరర్ రాథోడ్ , వైస్ ప్రెసిడెంట్ మహేష్ టంక్ , జాయింట్ సెక్రటరీ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో నూకాంబిక

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: ఉత్తరాంధ్ర ఇలవేల్పు ప్రముఖ పుణ్యక్షేత్రం అనకాపల్లి గవరపాలెంలో వెలిసిన శ్రీ నూకాంబిక అమ్మవారిలో ఆషాడ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా శ్రీ నూకాంబిక అమ్మవారి దేవస్థానం, ప్రముఖ వ్యాపారవేత్త మళ్ల జగ్గప్పారావ్ సహకారంతో అమ్మవారి మూలవిరాట్‌కు శాకాంబరి, వివిధ రకాల పండ్లతో అలంకరణ చేశారు. అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు, బాలింతలకు ఆలయం వద్ద పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేకంగా ఒక గది తయారు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బండారు ప్రసాద్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు

చేప, బెల్లం ద్రావణంతో అధిక దిగుబడులు

విశాలాంధ్ర - కశింకోట: ప్రకృతి వ్యవసాయంలో చేప, బెల్లం ద్రావణం పిచికారి చేయడం ద్వారా పిండె బాగా వస్తుందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కె.అరుణ రైతులకు వివరించారు. ఆదివారం సుందరయ్యపేట, తాళ్లపాలెం గ్రామాలలో స్వయం సహాయక సంఘాల వారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని ఆమె పరిశీలించారు. వంగ, మిరప, బెండ, కాకర, చుక్కాకు వంటి అంతర పంటలను ఆమే పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. 10 కిలోల చేపల వేస్టు, 10 కిలోల బెల్లం ఒక తొట్టిలో నాన వేసి 15 నుంచి 20 రోజులు మురిగిన తర్వాత 250 మి.మీ ద్రావాణాన్ని వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు.ఎం.సి.ఆర్.పీ ఎల్.1లు డీ రమణ, వెంకట లక్ష్మీ, ఎల్ 2లు, ఎల్ 3లు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకం శ్రీరామరక్ష

విశాలాంధ్ర - చింతపల్లి:- జగనన్న సురక్ష పథకం ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందలేని అర్హులైన వారందరికీ శ్రీరామ రక్ష అని వైకాపా అల్లూరి జిల్లా అధ్యక్షురాలు, పాడేరు శాసనసభ్యురాలు భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎర్ర బొమ్మల పంచాయతీలోని మారుమూల గ్రామాలలో ఆ పంచాయతీ సర్పంచ్, లోతా పండయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లో ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, స్థానిక సర్పంచ్ లోతా పండయ్య లతో కలిసి ఉత్సాహ భరిత వాతావరణంలో గడప గడపకు వెళ్లిన ఆమె తమ (వైకాపా) ప్రభుత్వంలో ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను గడప గడపలో వివరిస్తూ ఈ నాలుగేళ్ల వైకాపా పాలనలో ఆ కుటుంబాలు పొందిన లబ్దిని సంక్షేమ బావుటా పేరిట బుక్ లెట్ రూపంలో వివరించారు.రహదారులు, వంతెనలు లేని మారుమూల గిరి గ్రామాలలో సైతం పార్టీ శ్రేణులు, వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె చురుగ్గా పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీకి సంబంధించిన వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాలింత మృతి

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండలం లోదొడ్డి గ్రామానికి చెందిన బుటారి రామలక్ష్మి అనే బాలింత అనారోగ్యంతో కాకినాడ జిజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించినట్లు జడ్డంగి వైద్యసిబ్బంది తెలిపారు. రామలక్ష్మి 3 నెలల క్రితం మగ బిడ్డకు జన్మనిచ్చిందని తదుపరి అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఫ్యామిలి డాక్టర్ కార్యక్రమంలో గుర్తించి జడ్డంగి పీహెచ్‌సీలో వైద్యం అందించి మెరుగైన వైద్యం కొరకు కాకినాడ రిఫర్ చేశామని, వైద్యం పొందుతూ ఆమె మరణించినట్లు తెలిపారు. కాగా మండల టిడిపి అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, పౌష్టికాహార లోపం వలన బాలింత మృతి చెందినట్లు ఆరోపించారు.

నవ నిర్మాణ సంస్థ సేవలు సూపర్

గ్రావిటీ పథకం ఏర్పాటుతో గిరిజనుల కష్టాలు తీరాయి

విశాలాంధ్ర - హుకుంపేట: మన్యంలోని ఎన్నో గ్రామాలకు నేటికీ రక్షిత తాగునీరు అందటం లేదు. చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించడం, అసంపూర్తిగా వదిలేయడం, అధికారుల పర్యవేక్షణ సరిగా లేకపోవటం వంటి కారణాలతో కోట్లాది రూపాయలు వృథా అవుతున్నాయి. మరోవైపు భౌగోళిక పరిస్థితులు, సమీపంలో తాగునీటి వనరులు లేకపోవడం, ఎత్తైన ప్రదేశాలకు బోర్లు వేసిన కొన్ని రోజుల్లోనే పనిచేయకపోవడం, విద్యుత్తు సదుపాయం లేకపోవటం, సోలార్ సాయంతో ఇచ్చిన కొళాయిలు పనిచేయకపోవడం వంటి కారణాలతో ఇప్పటికీ చాలామంది గిరిజనులు తాగునీటి కోసం కిలోమీటర్ నుండి మూడు కిలోమీటర్ల వరకు మంచినీళ్ల కోసం నడుచు కుంటూ వెళ్లి గెడ్డలు, వాగులు, ఊటలపైనే ఆధారపడుతున్నారు. ఈ నేపథ్యంలో కొండ కోనల్లో నిత్యం ప్రవహిస్తున్న జలధారలను ఒడిసి పట్టి వాటిని శుద్ధి చేసి గ్రావిటేషన్ ద్వారా గిరిజనులకు తాగునీరు సరఫరా చేయడానికి విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి స్వచ్ఛంద సంస్థ నడుం బిగించింది. 2004 సంవత్సరం నుంచి నేటికి పాడేరు

మన్యంలోని 11 మండలాల్లో 900కు పైగా గ్రావిటీ పథకాలు నిర్మించింది. స్థానిక గిరిజనులతో శ్రమదానం చేయించి వారితోనే గ్రామాల్లో తాగునీటి పథకాల నిర్మాణానికి చర్యలు చేపడుతోంది. ప్రభుత్వాలు రూ. కోట్లు ఖర్చు చేసి ఎన్ని పథకాలు ఏర్పాటు చేస్తున్నా ప్రజల భాగస్వామ్యం లేకపోవడంతో అవి విఫలం అవుతున్నాయి. ఈ విషయం గుర్తించిన నవనిర్మాణ సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్థానికుల శ్రమదానం, భాగస్వామ్యంతోనే గ్రావిటీ మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటివరకు ఎటువంటి తాగునీటి పథకాలు ఏర్పాటు కాని గిరిజన గ్రామాలను, గతంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి ప్రస్తుతం పనిచేయని పథకాలున్న ఊళ్లను ఎంపిక చేస్తారు. ముందుగా సంస్థ ప్రతినిధులు బేస్లైన్ సర్వే చేసి సూక్ష్మస్థాయి ప్రణాళిక రూపొందిస్తారు. గ్రావిటీ పథకం ఏర్పాటు చేయదల్చిన గ్రామాల్లో కొండవాగుల నీటి ప్రవాహం, నీటి లభ్యత అంశాలపై నివేదిక రూపొందిస్తారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రావిటీ పథకం ఆవశ్యకత, ఉపయోగాల గురించి వివరిస్తారు. పంచాయతీతో తీర్మానం చేయించి తర్వాత ఆమోదానికి ఆర్డ బ్ల్యూఎస్, ఐటీడీఏ అధికారులకు పంపిస్తారు. ఆమోదం లభించిన తర్వాత స్థానిక గిరిజనుల ను భాగస్వామ్యులను చేస్తూ ప్లానింగ్, ట్రైనింగ్, మెటీరియల్, కన్స్ట్రక్షన్, మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేస్తారు.

ఆ తర్వాత సంస్థ ప్రతినిధులు పథకం నిర్మాణంపై గ్రామస్థులకు శిక్షణ ఇచ్చి కావాల్సిన సరకులను సరఫరా చేస్తారు. పథకం నిర్మాణం పూర్తయిన తర్వాత ఆ బాధ్యతలను గ్రామ కమిటీలకే అప్పగిస్తారు. పథకాలు మరమ్మతులకు గురైతే గ్రామస్థులు వాటిని బాగుచేసుకునేలా అవగాహన కల్పిస్తారు. హుకుంపేట మండలంలో సుమారు 40 గ్రామాల్లో ఈ పథకాలు నిర్మించారు.

సహజసిద్ధ పద్ధతులో శుద్ధి:

రక్షిత తాగు నీరు లేకపోవటం వల్లనే ఆదివాసులు అతిసార, టైఫాయిడ్, మలేరియా తదితర జ్వరాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం పథకాల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని పూర్తిస్థాయిలో శుద్ధి చేయడం లేదు. ఈ సమస్యను గుర్తించి ఇన్ఫోసిస్ ఫౌండేషన్ (బెంగళూరు), అజీమ్ ప్రేమ్జీ, ఫ్రెంక్ వాటర్ వారి ఆర్థికసాయంతో విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో నీటిని నేరుగా సరఫరా చేయకుండా సహజసిద్ధ పద్ధతుల్లో వడకట్టి, శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు.

కొండవా గులు, ఊటల నీరు గ్రావిటీ పథకాల ట్యాంక్లోకి చేరే విధంగా చర్యలు తీసుకుంటారు. ఈ నీటిని మూడు చాంబర్లు గల మరో ట్యాంక్లో ని పంపిస్తారు. రెండు చాంబర్లో ఇసుక, గులక రాళ్లు పైన వాటి కంటే కొంచెం పెద్దరాళ్లను వరుస క్రమంలో పేర్చి వాటి గుండా నీరు ప్రవహించేలా చేస్తారు. దీంతో నీరు శుద్ధి అవుతుంది. శుద్ధి అయిన నీళ్లు మూడో చాంబర్లో నిండి అక్కడి నుంచి కుళాయిల ద్వారా 10 నుంచి 15 కుటుంబాలకి ఒక కొళాయి వేసి ప్రజలకు సరఫరా.. చేస్తారు. ఈ ప్రక్రియకు ఎక్కడా విద్యుత్తు సదుపాయం అవసరం లేదు.

మా కష్టాలు తీరాయి

గతంలో గ్రావిటీ పథకం లేక సుదూరంలోని కొండ ప్రాంతం నుంచి తాగునీరు తీసుకొచ్చేవాళ్లం. ప్రతిరోజూ రెండు సార్లు ఉదయం, సాయంత్రం తాగునీటి కోసం నానా పాట్లు పడేవాళ్లం. నీళ్ల కోసం కుటుంబంలో ఒక వ్యక్తిని ఉంచిపోవాల్సి వచ్చేది. గ్రావిటీ నిర్మాణం తో సురక్షితమైన త్రాగు నీరు ఇంటి వద్దకే వస్తోంది. శుద్ధమైన నీరు తాగి అందరం ఆరోగ్యంగా ఉన్నాం.

- జానకిరామ్, ఓలుబెద్దా, తీగల వలస పంచాయితీ హుకుంపేట మండలం

ప్రతినెలా శుభ్రం చేసుకుంటున్నాం:

నవనిర్మాణ స్వచ్ఛంద సంస్థ మా గ్రామంలో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని కాపాడుకుంటున్నాం. ప్రతి ఆరు నెలలకు ఒకసారి గ్రావిటీ ట్యాంకును శుభ్రం చేసి మంచి నీరు గ్రామానికి వచ్చే విధంగా పనిచేస్తున్నాం. సంస్థకు మా గ్రామస్థుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నాం.

- రాంబాబు ఓలుబెద్దా, గిరిజనుడు

మేనిఫెస్టోలో మహిళలకు ప్రాధాన్యత

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత

విశాలాంధ్ర - పాయకరావుపేట: తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు తొలి విడత మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వంగలపూడి అనిత అన్నారు. పాయకరావుపేటలో నియోజవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వంగలపూడి అనిత మాట్లాడుతూ తల్లికి వందనంలో చదువుకునే పిల్లలు కుటుంబంలో ఎంతమంది ఉంటే అంతమందికి ప్రతి సంవత్సరం రూ.15 వేలు ఇవ్వడం, మహిళలకు సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వటం, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతికి ప్రతి నెల రూ. 3 వేలు తదితర ప్రకటించారని తెలిపారు. మేనిఫెస్టో లోని పథకాలను ప్రజల్లో ప్రచారం చేయాలని సూచించారు. అలాగే వైఎస్ఆర్ ప్రభుత్వం వైఫల్యాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి పోరాటం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు పెదిరెడ్డి చిట్టిబాబు, కొప్పిశెట్టి వెంకటేష్, అమలకంట అబద్ధం, జానకి శ్రీను పాల్గొన్నారు.

జోన్ 2లో అనధికారికంగా కొనసాగుతున్న చైన్‌మెన్‌లు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: టౌన్ ప్లానింగ్ విభాగంలో ఇన్చార్జి చైన్ మెన్ ల వ్యవస్థను రద్దుచేసి ఏడాదిన్నర అవుతున్నప్పటికీ ఇంకా ఇన్చార్జి చైన్ మెన్ ల గా జోన్ 2 మధుర వాడ లో సంతోష్, రమేష్ లు కొనసాగుతున్నరని, అయితే ఈ జోన్ లో రెగ్యులర్ చైన్ మెన్ సూర్యనారాయణ ఉన్నప్పటికీ ఆయనని డమ్మీ చేసి వీరిద్దరే జోన్ లో హవా ప్రదర్శిస్తున్నారని అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. వీరికి మేయర్ అండదండలు ఉన్నాయని ప్రచారం చేసుకుంటున్నారు. అనధికారికంగా వీరిని కొనసాగించడంపై తొలగించిన ఇన్చార్జి చైన్ మెన్ లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మధురవాడ ప్రాంతంలో అనధికార నిర్మాణాలు నిర్మూలన పేరుతో వార్డు సచివాలయ కార్యదర్శులతో వీరిద్దరూ కుమ్మక్కై భారీగా దందా చేస్తున్నారని పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. అందర్నీ తొలగించి వీరినే కొనసాగించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరు భారీగా ముడుపులిచ్చి చైన్ మెన్ లుగా కొనసాగుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎస్ఐసీఓటీకి 4 శాస్త్రీయ కథనాలు ఆమోదం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ సమర్పించిన 4 సైంటిఫిక్ రీసెర్చ్ ఆర్టికల్స్ ఈ ఏడాది. నవంబర్లో ఈజిప్ట్‌లోని కైరోలో జరిగే ప్రతిష్టాత్మక ఎస్ఐసీఓటీ (ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ ఆర్థోపెడిక్ సర్జరీ ట్రామాటాలజీ) వరల్డ్ కాంగ్రెస్లో ప్రదర్శన కోసం ఆమోదించబడ్డాయి. ఈ మేరకు ఎస్ఐసీఓటీ కాంగ్రెస్ సైంటిఫిక్ కమిటీ ఒక లేఖను పంపింది. ఇది అపోలో హాస్పిటల్స్ లో ప్రొఫెసర్ మరియు హెచ్ఓడీగా పని చేస్తున్న డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ కు దక్కిన అరుదైన గౌరవం. మన ఏపీ రాష్ట్రంలో మొదటిసారిగా డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ చేసిన 4 అరుదైన శస్త్రచికిత్సలు శాస్త్రీయ కథనాలలో ఉన్నాయి. వీరిలో బొటనవేలు, చీలమండ ఆర్థోస్కోపి మరియు పాదం లో వైకల్యం దిద్దుబాటు ఆధునిక ప్రక్రియల ద్వారా చికిత్స పొందిన వారు ఉన్నారు. వారందరూ త్వరగా సాధారణ స్థాయికి చేరి ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతూ అపోలో హాస్పిటల్స్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

జనసేన బలోపేతానికి మరింత కృషి చేయాలి

విశాలాంధ్ర - ఆనందపురం: అనందపురం జనసేన నాయకులు బొద్దాపు గోవింద్ ఆధ్వర్యంలో కణమాం, భీమన్న దొరపాలెం గ్రామపంచాయతీలలో జనసేన పార్టీ యువకులను, గ్రామ ప్రజలను కలిసి వాళ్ల సమస్యల గురించి తెలుసుకొని వారికి భరోసా కల్పించే విధంగా మండలంలో జనసేన పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి అందరూ కృషి చేయాలని పవన్ కళ్యాణ్ గారిని ముఖ్యమంత్రి చేయడమే జనసేన నాయకులు ఒక లక్ష్యం అని, రానున్న రోజుల్లో పార్టీ బలోపేతానికి నాయకులందరూ కలిసికట్టుగా ముందుకెళ్తే ప్రజల యొక్క సమస్యలపై పోరాటం చేస్తూ వారికి అండగా జనసేన పార్టీ ఉంటుందని భరోసా కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో భీమిలి జనసేన నాయకులు శాఖరి శ్రీనుబాబు, కృష్ణయ్య, మండల నాయకులు దుక్క వెంకటరావు, మూర్తి, మీసాల నాగేశ్వరరావు, జానకృష్ణ, తాడివాడ ప్రశాంత్ కుమార్ నాయుడు, సురేష్, శంకర్, రాంబాబు,సోంబాబు, కోరాడ శంకర్, భాస్కర్, అప్పలరాజు, విజయకుమార్ ,తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

సింహాచలం కుటుంబానికి అండగా వైసీపీ

విశాలాంధ్ర - చింతపల్లి :- అనారోగ్యంతో మృతి చెందిన చౌడుపల్లి పంచాయతీ వార్డు సభ్యుడు సింహాచలం కుటుంబానికి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షురాలు దురియా పుష్పలత లు అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ శనివారం ఉదయం విశాఖ కింగ్ జార్జ్ ఆసుపత్రిలో చౌడేపల్లి పంచాయతీ మెట్ట వీధి గ్రామానికి చెందిన పంచాయతీ వార్డు సభ్యుడు సింహాచలం మూత్రపిండాల వ్యాధితో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్నవారు పై విధంగా స్పందించారు. పార్టీ ద్వారా వార్డు సభ్యునిగా విజయం సాధించిన సింహాచలం చిన్న వయసులోనే మూత్రపిండాల వ్యాధి బారిన పడి డయాలసిస్ చికిత్స పొందుతూ మృతి చెందడం విచారకరమన్నారు. ఆయన మృతితో కుటుంబంలో పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని అన్నారు.

బలపం పంచాయతీలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - చింతపల్లి: బలపం పంచాయతీ లో నాలుగు కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ అన్నారు. బలపం పంచాయతీలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, స్థానిక ఏ ఎస్ పి ప్రతాప్ శివ కిషోర్ లతో కలసి బలపం పంచాయతీలో పర్యటించిన ఆయన ఆ పంచాయతీ అభివృద్ధికి నాలుగు కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిధులతో రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టి ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీ వీ ఆర్ఎం రాజు, డీ ఈ చాణిక్య లతో కలిసి రహదారులు, వంతెనల నిర్మాణాలపై చర్చించారు. పంచాయతీలోని 33 గ్రామాలలో రహదారి సౌకర్యం లేని గ్రామం ఉండకూడదని, వంతెనల నిర్మాణంతో గ్రామాలకు రహదారులు అనుసంధానం కావాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. అదే క్రమంలో రానున్న కాలంలో బలపం పంచాయతీలో అన్ని అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయనను తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.